# అర్వింద్ డైరెక్షన్.. జీవన్‌రెడ్డి యాక్షన్

- అర్వింద్, జీవన్‌రెడ్డిలది బాండ్ బంధం
- జీవన్‌రెడ్డి మాటలు ప్రజలు నమ్మలేరనే విషయం తెలిపోయింది
- ఓట్లు, ఎమ్మెల్యే సీటు కోసమే ఇంత దిగజారుడుతనమా..?
- కాంగ్రెస్ వస్తే తిరోగమనమే
- జగిత్యాల అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్


జగిత్యాల కలెక్టరేట్, నవంబర్ 27: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్‌లది బాండ్ బంధమని, అరవింద్ డైరెక్షన్‌లో జీవన్‌రెడ్డి యాక్షన్ చేస్తున్నాడని జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ విమర్శించారు. జగిత్యాల పట్టణం మోతె రోడ్డులోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో జగిత్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పసుపు బోర్డు తెస్తానని ఎంపీ ఎలక్షన్లలో ధర్మపురి అర్వింద్ బాండ్ పేపర్ రాసిచ్చి మాట తప్పినట్లే, నేడు జీవన్‌రెడ్డి బాండ్ పేపర్ విధానం కూడా ఉంటుందన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని జీవన్‌రెడ్డి బాండ్ పేపర్ రాసివ్వడంతో కాంగ్రెస్ మేనిఫెస్టో, గతంలో ఇచ్చిన హామీలన్నీ ఉత్తవేనని దేవుడి ముందు ఉంచి ఒప్పుకున్నట్లేనన్నారు. అసలు జీవన్‌రెడ్డి మాటలు ఎవరూ నమ్మడం లేదనే, ఈ బాండ్ పేపర్ నాటకాన్ని మొదలు పెట్టాడన్నారు. జీవన్‌రెడ్డి రాసిచ్చిన బాండ్ పేపర్ విలువ ఎంతంటే, ఆయన అల్లుడు ధర్మపురి అర్వింద్ పసుపు బోర్డుపై రాసిచ్చిన బాండ్ పేపర్‌తో సమానమన్నారు. బాండ్ పేపర్‌లతో అంకుల్(జీవన్‌రెడ్డి), అల్లుడు(అరవింద్) నాటకాలు ఆడుతున్నారన్నారు. 40ఏండ్ల రాజకీయ జీవితంలో జీవన్‌రెడ్డి జగిత్యాలకు చేసిందేమీలేకపోగా, ప్రతి పనికి అడ్డుపడుతూ అభివృద్ధి నిరోధకుడిగా మారాడని మండిపడ్డారు. అభివృద్ధికి అడ్డుపడటమే కాకుండా జీవన్‌రెడ్డి పచ్చి అబద్ధాలు మాట్లాడుతూ ఎలాగైనా గెలువాలని రోజురోజుకు దిగజారుతున్నాడన్నారు. జీవన్‌రెడ్డి తన చవకబారు మాటలు, చేష్టల వల్ల తన స్థాయిని తానే తగ్గించుకుంటున్నాడని విమర్శించారు. జగిత్యాలకు అన్నీ ఆయనే తెచ్చానని, రాజీవ్ రహదారి ఆయనే వేయించానని జీవన్‌రెడ్డి చెబుతున్నాడని, నాలుగు లైన్ల రాజీవ్ రహదారి జగిత్యాలకు కాకుండా రామగుండం ఎందుకు పోయిందో జీవన్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. జగిత్యాలలో మెడికల్ కళాశాల స్థలం, యావర్ రోడ్డు వెడల్పు, పాత బస్టాండ్ నుంచి గొల్లపెల్లి వైపు రోడ్డు వెడల్పు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీల వంటి ప్రతి పనికి అడ్డుపడ్డాడని, అయినప్పటికీ వాటిని పూర్తి చేశామన్నారు. మున్సిపల్ డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌పై శివారు గ్రామాల ప్రజల మెదల్లలో విషం నింపి వారిని రెచ్చగొట్టాడన్నారు. డ్రాఫ్ట్ ప్లాన్‌ను రద్దు చేశామని ప్రకటించామని, మాస్టర్ ప్లాన్‌ను జగిత్యాల మున్సిపల్ పరిధికే వర్తింపచేస్తామని క్లియర్‌గా చెప్పామని, కనీసం జగిత్యాల రెవెన్యూ పరిధి అని కూడా రద్దు కాపీలో పేర్కొనలేదని, అయినప్పటికీ జీవన్‌రెడ్డి అదే దుష్ప్రచారం చేస్తూ చిల్లర రాజకీయం చేస్తున్నాడని ధ్వజమెత్తారు.

### జీవన్‌రెడ్డి చేసిందేమీ లేదు..

కాంగ్రెస్ పాలన వల్లే పేదరికం పెరిగిందని, సమైక్య రాష్ట్రంలో తెలంగాణలోని తొమ్మిది జిల్లాలను కేంద్రం వెనుకబడిన జిల్లాలుగా ప్రకటించడమే పేదరికానికి నిదర్శనమన్నారు. మాట్లాడితే మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చిండ్రని మాట్లాడే జీవన్‌రెడ్డి, వెనుకబడిన రాష్ట్రం మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఎలా ఉంటుందో చెప్పాలన్నారు. దశాబ్దాలుగా జగిత్యాలలో జరుగని పనులు చేశాననే సంతృప్తి తనకు ఉందని, అసలు జీవన్‌రెడ్డి జగిత్యాలకు ఏం చేశాడో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో 2004 నుంచి 2014 వరకు ఎన్ని ఉద్యోగాలిచ్చిండ్రో చెప్పాలన్నారు. జగిత్యాలను వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశామని, సంక్షేమం కిందనే రూ.350కోట్లు చెల్లించామని చెప్పిన సంజయ్, 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పదికోట్లు కూడా సంక్షేమానికి ఖర్చుపెట్టలేదన్నారు. వడ్ల కొనుగోళ్లపై ఢిల్లీలో, గల్లీలో ధర్నాలు చేశామని, రైతునని చెప్పుకునే జీవన్‌రెడ్డి మరి అప్పుడెక్కడున్నడు..? ఎందుకు ధర్నాకు దిగలేదని, ధాన్యం కోత విషయంలో రైస్ మిల్లుల వద్ద ధర్నా చేద్దామంటే పత్తాలేకుండా పోయాడని దుయ్యబట్టారు. నూకల ఎగుమతిపై విధించిన నిషేధాన్ని కేంద్రప్రభుత్వం ఎత్తివేయాలని, లేదంటే కేంద్రప్రభుత్వమే పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. జగిత్యాల జిల్లా, జగిత్యాల నియోజకవర్గాన్ని విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి, విద్యుత్, తాగుసాగునీరు, మౌళిక సదుపాయాల కల్పన ఇలా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. స్వచ్ఛ భారత్‌లో జగిత్యాల జిల్లా దేశంలోని 750 జిల్లాల్లో నంబర్ 2గా నిలిచిందన్నారు. పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్, మెడికల్ కళాశాలలను పాత పది జిల్లాల తర్వాత ఏర్పాటు చేసుకున్నది కేవలం జగిత్యాల జిల్లాలో మాత్రమేనని స్పష్టం చేశారు. అభివృద్ధి చెందిన రాష్ట్రం, జిల్లా ఏది అని..? నేడు గూగుల్‌లో వెతికితే తెలంగాణ, జగిత్యాల జిల్లాలు కనపడుతాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వస్తే రాష్ట్రం, జగిత్యాల తిరోగమనమే కానీ పురోభివృద్ధి ఉండదన్నారు. రెండో సారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత జగిత్యాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మిస్తానని, కొత్తగా నిర్మాణమవుతున్న కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలకు ప్రాధాన్యత ఇస్తానని, యావర్ రోడ్డు విస్తరణ చేపడుతామన్నారు. వ్యవసాయాధిరిత జిల్లా కనుక వ్యవసాయానుబంధ పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానన్నారు. ఇక్కడ లైబ్రరీ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు గంగరాజం, మహేశ్వర్‌రావు, శ్రీనివాస్, సురేందర్‌నాయక్, గిరి, అంజనేయులు, రాజేందర్, ప్రణయ్, శ్రీకాంత్ ఉన్నారు.

# నేటి సాయంత్రం నుంచి ప్రచారం ఆపేయాలి

కలెక్టరేట్, నవంబర్ 27: కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఈ నెల 28 సాయంత్రం 5 గంటలకు ముగించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలింగ్ ముగింపునకు 48 గంటల ముందే రాష్ట్రమంతటా 144 సెక్షన్ అమలులో వస్తుందని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సమావేశాలు, ఇంటింటా ప్రచారం లాంటివి చేయవద్దని సూచించారు. పోలింగ్ ముగింపు సమయానికి 48 గంటల ముందు నుంచి సైలెన్స్ పీరియడ్ ఉంటుందని తెలిపారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి ఈ నెల 30 సాయంత్రం 5 గంటల వరకు టీవీ, సోషల్ మీడియాలో సైతం ప్రకటనలు, ప్రచారానికి అనుమతి లేదన్నారు. సైలెన్స్ పీరియడ్‌లో ఎలాంటి సర్వేలు, ఒపీనియన్ పోల్స్, నాయకుల ఇంటర్వ్యూ, ఎన్నికల చర్చలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే వార్తలను మీడియాలో ప్రసారం చేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. దినపత్రికల్లో వేసే ప్రకటనలకు ఎంసీఎంసీ ముందస్తు అనుమతి ఉండాలన్నారు. ఎవరైనా వ్యక్తులు లేదా పార్టీలు ఎగ్జిట్ పోల్ నిర్వహించడం, ఫలితాల వివరాలను వెల్లడించడం, పత్రికల్లో ప్రచురించడం, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారం చేయడం, ఇతర మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లడం చేస్తే, ఎలక్ట్రోరోల్ చట్టం ప్రకారం రెండేళ్ల జైలు, జరిమానా లేదా రెండూ ఉంటాయని హెచ్చరించారు. సైలెన్స్ పీరియడ్‌లో మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధించామని చెప్పారు. ఇతర ప్రాంతాల వారు 28న సాయంత్రం 5 గంటలలోపు జిల్లాలో నుంచి వెళ్లిపోవాలని కలెక్టర్ ఆదేశించారు.




# ఎన్టీపీసీలో కరెన్సీ కట్టలు

- కృష్ణానగర్‌లో ₹2 కోట్ల 18లక్షల 90 వేలు, బీ పవర్ హౌస్ వద్ద ₹50లక్షలు స్వాధీనం



పట్టుబడిన నగదును లెక్కిస్తున్న ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్

జ్యోతినగర్, నవంబర్ 27: రామగుండం నియోజకవర్గంలో ఆదివారం రాత్రి ఎన్నికల సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో భారీగా నగదు పట్టుబడ్డది. ఎన్టీపీసీ కృష్ణనగర్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ₹2కోట్ల 18లక్షల 90వేల నగదు, రామగుండం బీ పవర్‌హౌజ్ వద్ద ₹50లక్షలను స్వాధీనం చేసుకున్నారు. సీ విజిల్ పోర్టల్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో ఓ ఇంటిలో నిర్వహించిన తనిఖీల్లో ₹2కోట్ల 18లక్షల 90వేలు లభించిందని, ఎలాంటి ఆధారాలు లేనందున నగదును సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. నగదుతో పాటు జాతీయ పార్టీకి చెందిన కరపత్రాలు లభించినట్లు వెల్లడించారు. అలాగే రామగుండం బీ పవర్‌హౌస్ వద్ద ఎఫ్‌ఎస్‌టీ బృందం చేపట్టిన వాహన తనిఖీల్లో ₹50లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు.

### ఓట్ల కొనుగోలుకు కాంగ్రెస్ కుట్రలు

అధికార దాహం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలుపొందుటకు ఓటర్లను డబ్బులతో ప్రలోభాలకు గురి చేస్తుందని రామగుండం నగరపాలక డిప్యూటీ మేయర్ అభిషేక్‌రావు ఆరోపించారు. సోమవారం ఎన్టీపీసీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాల్గో డివిజన్ కృష్ణనగర్‌లో ఆదివారం రాత్రి ఎన్నికల అధికారులు కాంగ్రెస్ పార్టీకి చెందిన ₹2 కోట్ల 18లక్షల 90వేలు పట్టుబడ్డాయని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్‌కు సంబంధించి వాటర్ బ్యాటిల్ బాక్స్‌లు కూడా ఉన్నట్లు తెలిపారు. అలాగే రామగుండం బీ పవర్‌హౌస్ వద్ద పట్టుబడ్డ ₹50వేలు కూడ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సమీప బంధువుగా పేర్కొన్నారు. రామగుండంలో బీఆర్‌ఎస్ గెలుపు తథ్యమని తేల్చిచెప్పారు. ఇక్కడ కార్పొరేటర్లు రమణారెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, కృష్ణవేణి ఉన్నారు.

# స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ సెంటర్ల పరిశీలన

రాంనగర్, నవంబర్ 27: నగరంలోని స్థానిక ప్రభుత్వ ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్, అసెంబ్లీ నియోజకవర్గాల కొరకు ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూంల భద్రతా ఏర్పాట్లను సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి స్వయంగా పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం పోలైన ఈవీఎంల భద్రతకు నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ హాల్ వద్ద పూర్తి స్థాయిలో అవసరమైన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. వీటి భద్రతకు కేంద్ర సాయుధ బలగాలను కేటాయించామన్నారు. విధుల్లో ఉన్న అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ నరేందర్, టూటౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ రావు, కేంద్ర సాయుధ బలగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటి పంపగలము. 9281452762, 9515108830. NT-314461

CHANGE OF NAME

★ I, ERA BALAKRISHNA, S/o. Janardhan, R/o. F.No. 104, Rd.No. 2, Shiva Shankar Residency, Vidhyaranyapuri, Karimnagar, T.S. Changed My Name as ERRA BALAKRISHNA, S/o. Janardhan. NT-313028

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194